ఆశీర్వదించండి..మరింత అభివృద్ధి చేస్తా

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్


గేటెడ్ కమ్యూనిటీల సంక్షేమ సంఘాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: కొత్త కాలనీలు, గేటెడ్ కమ్యూనీలకు అవసరమైన అన్ని రకాల అభివృద్ధి పనులను రాబోయే రోజుల్లో చేపడతామని, ఈనెల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో ఓటు వేసి ఆశీర్వదించాలని సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి టి. ప్రకాశ్‌గౌడ్ కోరారు. శనివారం ఆయన నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలోని మైహోం అవతార్, అశోకాలివియానా గేటెడ్ కమ్యూనిటీల సంక్షేమ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంచినీరు, మురుగునీరు, రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యలను వారు ఆయన దృష్టికి తెచ్చారు. దాంతో ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఎదురవుతున్న సమస్యలపై తనకు అవగాహన ఉందని, మరోసారి రాబోయేది రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రభుత్వం ఏర్పడగానే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. ఈనెల 30వ తేదీన ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొని ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విచ్చలవిడిగా కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్లు

కాలుష్యం కోరల్లో హిమాయత్‌సాగర్
- ఇప్పటికే పదుల సంఖ్యలో ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు


కాంక్రీట్ మిక్సింగ్ లారీలతో దెబ్బతిన్న రహదారి

శంషాబాద్: జంటజలాశయాల్లో ఒకటైన హిమాయత్‌సాగర్‌కు కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్ల కాలుష్యం బెడద తీవ్రమవుతోంది. గతంలో క్రషర్ మాఫియాకు అడ్డాగా ఉన్న కొత్వాల్‌గూడ ప్రాంతం ఇప్పుడు అక్రమ కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్లకు అడ్డాగా మారుతోంది. గత నాలుగైదేళ్లుగా కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్లు ఒక్కొక్కటిగా పెరిగిపోతున్నాయి. ఎలాంటి పర్యావరణ, రెవెన్యూ అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా మారుతోంది.

పదుల సంఖ్యలో ఏర్పాటు

గతంలో ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున క్రషర్ యూనిట్లు ఉండడంతో ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి వాటిని ఇక్కడి నుంచి తొలగించారు. దీంతో ఖాళీగా ఉన్న ఈ స్థలాలను కొందరు కాంక్రీట్‌మిక్సింగ్ తయారీ పరిశ్రమలకు ఇవ్వడంతో పదులసంఖ్యలో పరిశ్రమలు వెలిసాయి. మూడేళ్ల కిందట కాలుష్య నియంత్రణ మండలి, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి వీటిని సీజ్ చేసినప్పటికీ కొందరు నేతలు, అధికారుల అండదండలతో తిరిగి పునరుద్ధరించారు.

మరో మూడు ప్లాంట్ల ఏర్పాటు...

ఇప్పటికే పదుల సంఖ్యలో ఉన్న వాటికి తోడు హిమాయత్‌సాగర్‌కు సమీపంలోనే ఔటర్ సర్వీసు రోడ్డు పక్కనే మరో మూడు కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై పర్యావరణ ప్రియులు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నా అధికారులు పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ఈ పరిశ్రమలకు చెందిన లారీలతో రహదారులు పూర్తిగా పాడై నిత్యం ప్రమాదాలకు కారణంగా మారుతున్నా పట్టించుకోకపోవడంపై కొత్వాల్‌గూడ వాసులు మండిపడుతున్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ విజయం ఖాయం


ప్రచారంలో పాల్గొన్న మేయర్ మహేందర్ గౌడ్ తదితరులు

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ కనీవిని ఎరుగని రీతిలో అత్యధిక మెజార్టీతో విజయం సాధించనున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ పరిధిలోని 7వ డివిజన్‌లో ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించి, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో గత పదిహేనేళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ పేద ప్రజలకు అండగా ఉంటూ, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దారన్నారు. ప్రజలంతా ఆయనకే మద్దతు తెలుపుతున్నారన్నారు. మరోసారి రాజేంద్రనగర్ సీటు బీఆర్ఎస్ సొంతమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుమర్, శివారెడ్డి, కిషోర్‌రెడ్డి, నదీం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి


నార్సింగిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న అశోక్‌యాదవ్

మణికొండ: తెలంగాణ ప్రజల కష్టనష్టాలను గమనించే సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకుని రావాలని నార్సింగి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ అన్నారు. శనివారం ఆయన నార్సింగి, కోకాపేట, ఖానాపూర్, పలు గేటెడ్ కమ్యూనిటీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ ముదిరాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.కిరణ్‌కుమార్, వెంకటేష్, రాము, వినోద్‌కుమార్, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద అదనపు బలగాలను నియమించాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పోలింగ్ బూత్‌ల వద్ద అదనపు బలగాలను నియమించాలని కోరుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ శనివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందజేశారు. అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం,రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలోని పోలింగ్ బూత్‌లు అతి సున్నితమైన ప్రాంతాలుగా ఉన్నాయని వివరించారు. ఈ పోలింగ్ బూత్‌లలో అదనపు పోలీసులను ఏర్పాటు చేయాలని కోరారు. పోలింగ్ బూత్‌లలో ఏర్పాటు చేసే ఏజెంట్ల పూర్తి వివరాలను సేకరించిన అనంతరమే అనుమతి ఇవ్వాలని కోరారు.

రాజేంద్రనగర్‌ను ఆదర్శ నియోజకవర్గంగా మారుస్తా


శంషాబాద్ పట్టణంలో ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్

శంషాబాద్: తనను గెలిపిస్తే రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా మారుస్తానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ అన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో గొల్లపల్లి, ఊటుపల్లి, రాళ్లగూడ, ఆర్బీనగర్, సిద్ధంతి, కొత్వాల్‌గూడలో ఏర్పాటు చేసిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సార్లు గెలిచిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ రాజేంద్రనగర్ నియోజవర్గానికి చేసిందేమిలేదని, కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధితోనే ఈ ప్రాంతానికి అంతర్జాతీయ ఖ్యాతి దక్కిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుండడంతో స్థానికంగా కాంగ్రెస్‌ను గెలపించుకోవాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, సీనియర్ నాయకులు మైలారం సులోచన తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే స్వచ్ఛమైన పాలన


మంచిరేవులలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మణికొండ: దశాబ్దకాలంగా కేంద్రంలో, ఐదు పర్యాయాలుగా అనేక రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలలో ప్రజలకు స్వచ్ఛమైన, అవినీతి రహిత, పరిపాలన అందుతోందని, వాటి జతకు తెలంగాణను సైతం చేర్చాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందని జిల్లా ఓబీసీ మోర్చ అధ్యక్షుడు డి.,లక్ష్మీనారాయణ, నార్సింగి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు సీహెచ్ భిక్షపతి యాదవ్ అన్నారు. శనివారం వారు నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట, మంచిరేవుల, నార్సింగి గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజలకు అవసరమైన సంక్షేమం, అభివృద్ధిని అందించటంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పయనింపచేయాలన్నారు. అందుకు రాష్ట్రంలో నియంత పాలనకు చరమగీతం పాడి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆదిత్యారెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, జైపాల్‌రెడ్డి, నాగేష్‌లతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

మణికంఠ కాలనీలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

రాజేంద్రనగర్: మణికంఠ కాలనీలో శనివారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి శంకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. బండారి శంకర్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ డివిజన్ మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి టీ ప్రకాశ్ గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆదర్శనగర్, లక్ష్మీనారాయణ అపార్ట్‌మెంట్‌లలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు సదాన శ్రీనివాస్ రెడ్డి, వినోద్ కుమార్, స్వప్న, వేణు, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు నేడు పోలింగ్

రాజేంద్రనగర్: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులతో పాటు నాన్ టీచింగ్ సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది తమ ఓటును వినియోగించుకునేందుకు ఆదివారం ప్రత్యేకంగా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో పోలీసు అధికారులతో పాటు సిబ్బందికి ప్రత్యేకంగా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు నాన్ టీచింగ్ సిబ్బందికి శివరాంపల్లిలోని జడ్పీహెచ్ఎస్ హై స్కూల్‌లో మరో బూత్‌లు ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ బూత్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తగిన ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి మల్లయ్య ఆధ్వర్యంలో పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఈ పోలింగ్ బూత్‌లను పోలీసు అధికారులతో పాటు రిటర్నింగ్ అధికారి శనివారం పరిశీలించి తగు ఏర్పాట్లను పూర్తి చేశారు.

ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

అత్తాపూర్: డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మిద్దెల సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా భరత్‌నగర్ కాలనీతో పాటు పలు కాలనీల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కారు గుర్తుకే మన ఓటు అని చెబుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే టీ. ప్రకాశ్ గౌడ్‌కు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిద్దెల సురేశ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శివారెడ్డి, కామసాని మహేందర్ రెడ్డి, కావలి శేఖర్, సేగురి అర్జున్ రెడ్డి, పీఎం రెడ్డి, శ్రీపల్మరియ తదితరులు పాల్గొన్నారు.

నో బీఆర్ఎస్.. నో కాంగ్రెస్... ఓన్లీ బీజేపీ

అత్తాపూర్: రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి కమలం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మార్పీఎస్ నాయకులు అత్తాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సాయి యాదవ్‌తో కలిసి శనివారం అత్తాపూర్ హైదర్‌గూడలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటును హర్షిస్తూ నో బీఆర్ఎస్.. నో కాంగ్రెస్... ఓన్లీ బీజేపీ అనే నినాదలిస్తూ తోకల శ్రీనివాస్ రెడ్డి కమలం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించి ఆ విజయాన్ని నరేంద్ర మోదీకి బహుమతిగా ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధ్యక్షులు గోదెల శ్యామ్ ప్రభు, నర్సింగ్ రావు (చిన్న), దేవెందర్, జగన్, బాబురావు, వినయ్, లడ్డూ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ





మణికొండ: స్వామియే శరణం అయ్యప్ప అంటూ నార్సింగి కేవీఎంఆర్ గార్డన్ ఫంక్షన్ హాల్ మార్మోగింది. శనివారం కె.వెంకటరమణారెడ్డి నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడిపూజకు పెద్ద ఎత్తున అయ్యప్ప మాలాధారులు, భక్తులు పాల్గొన్నారు. ఉదయం 6గంటలకు గణపతి హోమంతో ప్రారంభమైన పూజ అనంతరం కేశవగురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడిపూజను నిర్వహించారు.

నిధులు తేవడంలో ఎమ్మెల్యే విఫలం

మైలార్‌దేవ్‌పల్లి: బీఆర్ఎస్ అసమర్థ పాలనలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నిధులు తేవడంలో విఫలమయ్యారని రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

శనివారం రాజేంద్రనగర్, నార్సింగి , పుప్పాల గూడ అపార్టుమెంటు ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బృందావన్ కాలనీ నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కార్యకర్తలు భారీగా బీజేపిలో చేరారు. అనంతరం తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..బీఆర్ఎస్ అసమర్థ పాలన ఎలా ఉందో అపార్టుమెంటు వాసులకు తెలిసిందని అభివృద్ధి చేయని అసమర్థ ఎమ్మెల్యేను ఎన్నుకోవడం వల్లే అనేక సమస్యలు ఎదుర్కొనవలసి వస్తుందని అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని సమస్యలను ఏనాడు అసెంబ్లీలో మాట్లాడని ఎమ్మెల్యేతో ప్రజల సమస్యలు ఎలా తీరుతాయని పేర్కొన్నారు.

ప్రధాని మోదీకి ఘన స్వాగతం



రాజేంద్రనగర్: ఈ నెల 30వ తేదీన జరగబోయే ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మహేశ్వరం అసెంబ్లీలో జరిగిన భారీ బహిరంగ సభకు విచ్చేసిన దేశ ప్రధాని నరేంద్ర మోదీని హెలిపాడ్ వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ ఘనంగా స్వాగతం పలికారు.

కాంగ్రెస్ నాయకుల ఎన్నికల ప్రచారం


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: బుద్వేల్ ప్రాంతంలోని పాత గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు కోరని శ్యామ్ హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో, హామీల కరపత్రాలను ఓటర్లకు అందజేస్తూ వాటి ప్రాముఖ్యాన్ని వివరించారు. ప్రజా సంక్షేమ పథకాలు కావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని విన్నవించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం


చంద్రమ్మ (ఫైల్)

రాజేంద్రనగర్: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వృద్ధురాలు కనిపించకుండా పోయిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గండిపేట్ కిస్మత్‌పుర ప్రాంతానికి చెందిన చంద్రమ్మ (70) ఈ నెల 12వ తేదీన ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లింది. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

బీజేపీ సంకల్ప యాత్రలో పాల్గొన్న తోకల శ్రీనివాస్‌రెడ్డి


ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభలో పాల్గొన్న తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ లో బీజేపీ జెండా ఎగురువేయడం ఖాయం అని రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మహేశ్వరం తుక్కుగూడాలో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపి సంకల్ప యాత్రలో ఆయన ఆశీర్వాదాన్ని పొందాడు. ప్రధాని మోదీ మాట్లాడుతూ..అన్ని నియోజకవర్గాలలో బీజేపీ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

వైభవంగా జ్వాలా తోరణం

లంగర్‌హౌస్: తులసీ నారాయణుల కల్యాణాన్ని భక్తులు వీక్షించి తరించారు. లంగర్‌హౌస్ త్రివేణి సంగం ఒడ్డున వెలసిన జానకీ సమేత వీరవెంకట విజయరాఘవస్వామి ఆలయంలో పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో తులసీ లక్ష్మీ నారాయణుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. తర్వాత కల్యాణ తులసీ లక్ష్మీనారాయణులను పల్లకీలో ఊరేగించారు. అనంతరం రాలీలా మైదానంలో జ్వాలా తోరణం వెలిగించి కింద నుంచి స్వామి అమ్మవార్లను పల్లకీలో తీసుకెళ్లగా భక్తులు జ్వాలా తోరణం కింద నుంచి ఈదారు. ఆలయ ప్రాగణంలోని ధ్వజ స్తంభానికి పండితులు రాజనర్సిహచారి, శ్రీనివాస్, రింకు శాస్త్రిలతో కలిసి రాహుల్‌దాస్ బాబా కార్తీక ఆకాశ దీపం సమర్పించారు.


జ్వాలా తోరణం కింద నుంచి వెళ్తున్న భక్తులు

జూపార్కులోని లంగూర్ దత్తత

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కు సందర్శనకు వచ్చిన జి.ప్రవీణ్ వర్మ, హిమ బిందు దంపతులు నార్తర్న్ ప్లెయిన్స్ గ్రే లంగూర్‌ను 9 నెలల పాటు దత్తత తీసుకున్నారు. దత్తతకు సంబంధించిన రూ.75 వేల నగదును జూపార్కు క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్ హిరేమత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుటుంబసభ్యులు జూలోని లంగూర్ ఎన్‌క్లోజర్‌ను సందర్శించి జూ యాజమాన్యం జంతువుల పరిశుభ్రత, నిర్వహణ, సంక్షేమంపై సంతోషం వ్యక్తం చేశారు. క్యూరేటర్ హిరేమత్ మాట్లాడుతూ..జూపార్కులోని వన్యప్రాణులను సామాజిక బాధ్యతగా దత్తత తీసుకునేందుకు పౌరులు, విద్యా సంస్థలు, కార్పొరేట్లు, బ్యాంకింగ్ రంగాలు ముందుకొచ్చి కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద అడవి జాతులను దత్తత తీసుకోవాలన్నారు. డిప్యూటీ క్యూరేటర్ ఎ.నాగమణి, జూపార్కు సిబ్బంది పాల్గొన్నారు.